## శాంతిభద్రతలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు

- ఎస్ఐ కాటయ్య



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ కాటయ్య

**తాడిపత్రిఅర్బన్, జనవరి 28 ప్రభాతవార్త**

శాంతిభద్రతలను ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని రూరల్ ఎస్ఐ కాటయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన ఆలూరులో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో ఏవైన సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో గొడవలు పడడం, గ్రూప్ రాజకీయాలు చేయడం, ఫ్యాక్షన్ కార్యకలాపాలు కొనసాగించడం వంటివి మానుకోవాలన్నారు. అతిక్రమిస్తే తమదైనశైలిలో కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే రహదారి భద్రత గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించడంతో పాటు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్ఐ వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రికార్డుల తనిఖీ

**యాడికి, జనవరి 28 ప్రభాతవార్త**



ఫీవర్ సర్వే తనిఖీ చేస్తున్న దృశ్యం

తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు బుధవారం రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. జిల్లా మలేరియా అధికారి డి.ఓబుల్ ఆదేశాల మేరకు రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరాజన్, డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో ల్యాబ్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జ్వరంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారికి డెంగు, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గునియా తదితర రక్త పరీక్షలు నిర్వహించాలని ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ సాయిలతకు తెలియజేశారు. ఫీల్డ్‌లో ఆరోగ్య కార్యకర్తలు తీసిన రక్త పూతలను తప్పక పరీక్షించాలన్నారు. అనంతరం చందన సచివాలయం పరిధిలో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే తనిఖీ చేశారు. అలాగే ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే తప్పక పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి కవిత, మేల్ అసిస్టెంట్ మైముద్దీన్, ఆశ కార్యకర్త నాగలక్ష్మి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా - వ్యక్తి మృతి

**తాడిపత్రిఅర్బన్, జనవరి 28 ప్రభాతవార్త**



ప్రమాదంలో మృతి చెందిన అంకాలు

తాడిపత్రి మండలం వెంకటాంపల్లి వద్ద బుధవారం ఆటో బోల్తాపడిన సంఘటనలో అంకాలు (50) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా వున్నాయి. యాడికి మండలం గుడిపాడు గ్రామానికి చెందిన అంకాలు బేల్దారి పని చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. బుధవారం అంకాల్‌తో పాటు వెంకటేష్ అనే వ్యక్తి సొంత పనిమీద గుడిపాడు నుండి తాడిపత్రికి ఆటోలో వస్తుండగా వెంకటాంపల్లి గ్రామ సమీపంలోకి రాగానే ఆటో డ్రైవర్ ఆటోను అజాగ్రత్తగా నడపడంతో ఆటో రోడ్డు పక్కన ఉన్న రాయిని ఎక్కడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటో అంకాలు మీద పడడంతో తలకు, ఎడమ చేతికి గాయాలయ్యాయి. అతన్ని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న మరొక వ్యక్తి వెంకటేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. అంకాలు భార్య మంజుల లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని తనిఖీ చేసిన డి ఎల్ పి ఓ



చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం.

**అనంతపురం రూరల్, జనవరి 28 ప్రభాతవార్త**

డివిజనల్ పంచాయతీ అధికారి విజయ్ కుమార్ ఉప్పర పల్లి గ్రామపంచాయతీ లో ప్రతి రోజూ జరుగుతున్న ఇంటి ఇంటి చెత్త సేకరణ మరియు చెత్త నుండి సంపద కేంద్రను సందర్శించి, ప్రతి రోజు చెత్త ను తడి చెత్త పొడి చెత్త వేరు చేసి వర్మీ తయారు చేయాలనిక్లాప్, మిత్రాలకు సూచించారు.అదే విధంగా ఇంటి పన్నులు మరియు ట్రేడ్ లైసెన్స్ పన్నులు, స్వామిత్వ సర్వే లను అన్నికూడావెంటనే సిబ్బంది అందరు పూర్తి చేయాలనిఆదేశించారు. ఈ కార్యక్రమంలోపంచాయతీ అభివృద్ధి అధికారి వర్ల శంకర్, పంచాయతీ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్ శివ పాల్గొన్నారు.

## వజ్రగిరిలక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేకపూజలు

**పెద్దపప్పూరు, జనవరి 28 ప్రభాతవార్త**



మండలంలోని తిమ్మనచెరువు కొండపై వెలసిన శ్రీవజ్రగిరిలక్ష్మీ నరసింహస్వామికి బుధవారంనప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసం పురస్కరించుకుని ఉదయం అర్చకులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించి అనంతరం పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఉపాధి హామీ మస్టర్లు తనిఖీ

**గాండ్లపెంట జనవరి 28 ప్రభాతవార్త**

మండలంలోని కురుమామిడి కత్తి వారి పల్లి పంచాయతీలలో ఉపాధి హామీ పనులకు సంబంధించి మస్టర్లను ఎంపీడీవో రామకృష్ణ తనిఖీ చేశారు అదేవిధంగా కూలీలతో జరుగుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు కత్తి వారి పల్లి పంచాయతీలో పతివారిపల్లెలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే నిర్వహించారు ఈ కార్యక్రమంలో అధికారి సిబ్బంది పాల్గొన్నారు

## వన్యప్రాణులకు అడవులే ఆవాసం

-అడవులను సంరక్షిద్దాం - వన్యప్రాణులను కాపాడుదాం

-అటవీశాఖ ఆధ్వర్యంలో అడవులపై ప్రజలకు అవగాహన సదస్సు



అడవులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

**యాడికి, జనవరి 28 ప్రభాతవార్త**

మానవుని అనాలోచిత నిర్ణయాల వలన అడవికి నిప్పు రాజేయడం వలన అక్కడ నివసించే వన్యప్రాణులు, చెట్లు మాడి మసై మానవాళి మనుగడకు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తోందని అటవీశాఖ అధికారి నారపరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కోనఉప్పలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచు రామలక్ష్మమ్మ ఆధ్వర్యంలో అడవులకు నిప్పు పెట్టడం వలన కలిగే దుష్ఫలితాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు ఉండటం వలన చెట్ల నుండి వచ్చే ప్రాణవాయువు మానవాళికి ఆరోగ్యంతో పాటు స్వచ్ఛమైన గాలిని ఇస్తోందన్నారు. అక్కడ ఆవాసం ఏర్పరచుకొని వివిధ వన్యప్రాణులు జీవిస్తుంటాయని, అడవిలోని చెట్ల వలన సకాలంలో వర్షాలు కురవడంతో మానవాళికి కలిగే వివిధ సత్ఫలితాల గురించి ప్రజలకు వివరించారు. రైతులు తాము పండించే పంటలపై వన్యప్రాణులు నష్టం కలుగజేస్తే వాటికి అయ్యే ఖర్చును ప్రభుత్వం భరించేలా తగు చర్యలు తీసుకుంటోందని, నగరాలలో స్వచ్ఛమైన గాలి కోసం వేల రూపాయలు ఖర్చు చేస్తుండడం ప్రతి ఒక్కరూ గమనించాలని, సమృద్ధిగా ఉన్న చెట్లు, దట్టంగా ఉండే అడవుల నుండి వచ్చే స్వచ్ఛమైన గాలితో ప్రతి జీవి ఆరోగ్యంగా జీవిస్తుందని, ఇందులో మానవుడు కూడా ఉండడం విశేషమన్నారు. అనాలోచితంగా అడవులకు నిప్పు పెట్టడం చట్టరీత్యా నేరమని, ప్రమాదవశాత్తు నిప్పు రగిలితే వెంటనే ఆర్పే ప్రయత్నం చేయాలని, అలాగే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషికం అందజేస్తామన్నారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ పథకం కింద వన్య ప్రాణుల దాహార్తిని తీర్చేందుకు నీటి కుంటలు ఏర్పాటు చేయనున్నట్లు ఈ కార్యక్రమం స్థానికుల సహాయ సహకారాలతో నిర్వహిస్తామని తమకు ప్రజలు సహకరించాలని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు మారికె రామలక్ష్మమ్మ, అటవీశాఖ సిబ్బంది చంద్రశేఖర్, రామాంజనేయులు, ప్రతాప్, తిమ్మప్ప, గ్రామ ప్రజలు రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన

**పెద్దవడుగూరు, జనవరి 28 ప్రభాతవార్త**



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఆంజనేయులు

రోడ్డు భద్రతపై ఎస్ఐ ఆంజనేయులు బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పి జగదీష్ ఆదేశాల మేరకు పెద్దవడుగూరులోని ప్రధాన కూడళ్లలో పోస్టర్లు అతికించి, గ్రామాల్లో ఆటోల ద్వారా ప్రచారం చేస్తూ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. అలాగే గ్రామాల్లో ఆటోల ద్వారా రోడ్డు భద్రతా సందేశాలను ప్రచారం చేయడంతో పాటు, ప్రజలు అధికంగా చేరే ముఖ్య కూడళ్లలో రోడ్డు భద్రతకు సంబంధించిన పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆంజనేయులు మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఫోర్‌వీలర్ వాహనాల్లో వెళ్లే వారు సీట్ బెల్ట్ వినియోగించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రజలు రోడ్డు భద్రత నిబంధనలను పాటిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్దరించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

**పుట్లూరు, జనవరి 28 ప్రభాతవార్త**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్దరించాలని పుట్లూరు మండలం కడవకల్లు గ్రామంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి ఆధ్వర్యంలో బుధవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టజీవుల పొట్టలు కొట్టే చట్టాన్ని రద్దు చేయాలని పని హక్కును కాపాడుకుందామని కొత్త చట్టం రాష్ట్రానికి భారం కార్పోరేట్లకు లాభమని గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీలకు పేద రైతులకు పని కల్పించడంతో పాటు వలసలు తగ్గించడానికి తోడ్పడే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం రద్దుచేస్తోందన్నారు. ఆ స్థానంలో తెచ్చిన కొత్త చట్టం ఉపాధి హామీ హక్కును దెబ్బతీస్తుందన్నారు. కేంద్రం తన బాధ్యతను 90 శాతం నుండి 60 శాతంకు తగ్గించుకొని రాష్ట్రాలపై భారం మోపడం వల్ల భూస్వాముల పెత్తనం పెరిగి తిరిగి వలసలు ఆత్మహత్యలు గ్రామీణ నిరుద్యోగం పెంచుతుందన్నారు. ఈ సందర్భంగా వీకే మోరియల్ హాల్‌లో నిర్వహించనున్న సదస్సుకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా ప్రధాన కార్యదర్శి వెంకట్, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, మహిళా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ వి.శివనాగరాణి, వివిధ జిల్లాల నుంచి ముఖ్యమైన నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి నూతనంగా తీసుకొచ్చిన ఏఎం చట్టంపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ చట్టం పేద కూలీల కడుపు కొట్టే విధంగా ఉందన్నారు. కావున సదస్సుకు ప్రముఖులు మేధావులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి టి.పెద్దయ్య, టి.ఆదినారాయణ, శివారెడ్డి, జె.పెద్దయ్య, ఇస్మాయిలు, నాగేంద్ర, కూలీలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీగౌరీశంకరుల గ్రామోత్సవం

**యాడికి, జనవరి 28 ప్రభాతవార్త**

మండల పరిధిలోని రాయలచెరువులో శ్రీగౌరీశంకరుల గ్రామోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అర్చకులు రుద్రయ్య స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరీశంకరుల వేషధారణలో కళాకారులు ప్రత్యేక నృత్యాలతో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున మాలదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## ఉత్తమ సేవా పురస్కార గ్రహీతకు సన్మానం

- ఎస్సై మల్లికార్జునరెడ్డికి శుభాకాంక్షలు వెల్లువ



ఎస్సైను సన్మానిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

**ఓబుళదేవరచెరువు, జనవరి 28, ప్రభాతవార్త**

విధుల పట్ల అంకితభావం, వేగవంతంగా ప్రజా సమస్యల పరిష్కారంలో సబ్ ఇన్స్పెక్టర్ బి మల్లికార్జునరెడ్డి చేస్తున్న కృషిని గుర్తించి ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారం అందించి అభినందించింది. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు ఎస్సై మల్లికార్జునరెడ్డిని కలిసి శుభాకాంక్షలు వెల్లువలా కురిపిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం వడ్డెర సేవా సంఘం, యువసైన్యం సభ్యులు ఎస్సై మల్లికార్జునరెడ్డిపై ప్రశంసలు కురిపించి శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సేవా సంఘం అధ్యక్షుడు ఇడగుట్ట ఆంజనేయులు, బిజెపి మండల కన్వీనర్ వీరాంజినేయులు, అల్లాపల్లి సింగిల్ విండో డైరక్టర్ నారాయణ, కుంచెపు శ్రీనివాసులు, చంద్ర, గంగులప్ప, రంగనాయకులు, నాగరాజు, శ్రీరాములు, వెంకటనారాయణ, వైభవి ఆంజనేయులు, గోగుల వెంకటనారాయణ, వెంకటేష్, డి అంజి తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ 2లో మెరిసిన విజయ్ కుమార్ నాయక్



విజయ్ కుమార్ నాయక్

**నల్లచెరువు జనవరి:28 ప్రభాతవార్త**

నల్లచెరువు మండల పరిధిలోని బానేపల్లి దిగువ తండా కు చెందిన మూడే వెంకటరమణ నాయక్, ప్రమీల దంపతుల కుమారుడు మూడే విజయ్ కుమార్ నాయక్ గత సంవత్సరంలో గ్రూప్ 2 పరీక్షల్లో రాయడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈరోజు దినమున పరీక్షలు రిజల్ట్ రావడంతో ఎక్సేజ్ సబ్ ఇన్స్పెక్టర్ గా ఎంపిక అయ్యారని తల్లిదండ్రులు సంతోషాలు వ్యక్తం చేశారు ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చేస్తూ బాలేపల్లి తండా గ్రామస్తులు మన గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చారని తల్లిదండ్రులు కూలి నాలి చేసే కష్టపడి చదివించి ఉద్యోగం రావడం విజయ్ కుమార్ నాయక్ కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## కష్టపడే ప్రతి ఒక్కరికి పార్టీలో గుర్తింపు

- నల్లచెరువు కన్వీనర్ మొండెం రవికుమార్ రెడ్డి



రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించిన మండల కన్వీనర్ మండెం రవి కుమార్ రెడ్డి

**నల్లచెరువు జనవరి:28 ప్రభాతవార్త,**

వైఎస్సార్ సీపీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందని నల్లచెరువు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మొండెం రవికుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఓరువాయి పంచాయితీ లో కన్వీనర్ రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రచ్చ బండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుల సమ్మతితో గ్రామ కమిటీ లను సభ్యులను ఎంపిక చేశారు. కన్వీనర్ మాట్లాడుతూ.. వైఎస్ఆర్సిపి ఏ కార్యక్రమం తలపెట్టిన ఆదర్శంగా నిలుస్తున్నామంటే అందుకు ప్రధాన కారణం పార్టీలో ఉండే నికార్సైన కార్యకర్తలు మన పార్టీలో ఉండడమే అన్నారు. కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు కమిటీలలో చోటు కల్పించామన్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు బంద్రేవు నరసింహా రెడ్డి, పో రెడ్డి వెంకట రెడ్డి, నరసింహ రెడ్డి, పల్లె వెంకట రెడ్డి, టి. ఆనంద్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ ( పాలపాటి దిన్నె టెంపుల్ మాజీ చైర్మన్) ఆనంద్ రెడ్డి, కమిటీ పరిశీలకుడు రమణా రెడ్డి, గ్రామ ఐటి అడ్వైజర్ భోనాలా ఖాదర్ వలి, మైనార్టీ నాయకులు నజీర్, మహమ్మద్ రఫీ, మొండెం చంద్రశేఖర్ రెడ్డి, మండల యూత్ కన్వీనర్ షేక్ మన్సూర్ భాష, ఎర్రగుడి ప్రభాకర్, నాయకులు బర్ర నరసింహా రెడ్డి, రవికుమార్ రెడ్డి, భాస్కర్ నాయుడు, రవులు, తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ



మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

**అనంతపురం న్యూటౌన్, జనవరి 28 ప్రభాతవార్త**

పదవ తరగతిలో మెరుగైన మార్కులు సాధించడానికి ఎస్‌టియు రాష్ట్ర అకడమిక్ కమిటీ రూపొందించిన పదవ తరగతి విద్యార్థుల కోసం ఎస్ఎస్‌సి స్టడీ మెటీరియల్‌ను బీసీ ఎస్సీ హాస్టల్ విద్యార్థులు అయిన 100 మంది బాలికలకు ఎడి మునీర్ ఖాన్ చేతులమీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మునీర్ ఖాన్ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధించడానికి నిష్ణాతుల చేత తయారు చేయబడిన ఈ స్టడీ మెటీరియల్‌ని బాగా ఉపయోగించుకుని మంచి ఫలితాలతో, రాష్ట్రంలోనే 10వ తరగతి ఉత్తీర్ణతలో మొదటి స్థానంలో నిలవాలని కోరారు. ఈ సందర్భంగా స్టడీ మెటీరియల్ దాత అయిన కే పాండు రంగయ్య శెట్టి ఆర్‌టిడి టీచర్‌ని ఎడి-1 ఘనంగా సన్మానించారు. ఎస్‌టియు అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, ఎస్‌టియు రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ బి.ఫణి భూషణ్, ఎస్‌టియు సీనియర్ నాయకులు జనార్ధన్ మాట్లాడుతూ.. ఈ స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, గత సంవత్సరం ఈ స్టడీ మెటీరియల్‌లో దాదాపుగా ఎక్కువ ప్రశ్నలు రావడం జరిగిందని తెలియజేశారు. అదేవిధంగా ఈ సంవత్సరం మార్చిలో జరగబోయే ఎస్ఎస్‌సి పరీక్షల్లో కూడా ఎక్కువ శాతం ప్రశ్నలు ఈ యొక్క స్టడీ మెటీరియల్ నుండీ వస్తాయని విద్యార్థులు వీటిని చక్కగా సాధన చేసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌సి నగర ప్రధాన కార్యదర్శి వై.మల్లికార్జున బీసీ, ఎస్సీ హాస్టల్ వార్డెన్స్ వై.మాధవి లత కె.అనిత పాల్గొన్నారు.

## విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన

**అనంతపురం కలెక్టరేట్, జనవరి 28 ప్రభాతవార్త**

రోడ్డు సేఫ్టీ మిషన్‌లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ట్రిల్స్ స్కూల్ విద్యార్థులకు స్థానిక క్లాక్ టవర్ వద్ద పోలీస్ సిబ్బంది పర్యవేక్ష ణలో ట్రాఫిక్ నిబంధనలు, ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ సింబల్స్ గురించి క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. అదేవిధంగా విద్యార్థులను డ్రైవింగ్ లైసెన్స్ స్కూల్ వద్దకు తీసుకువెళ్లి, డ్రైవింగ్ లైసెన్స్ ఎలా జారీ చేస్తారు, దానికి అవసరమైన డాక్యుమెంట్లు ఏమిటి అనే విష యాలను వివరించడం జరిగింది. అలాగే రోడ్డు ప్రమాదం జరిగిన సందర్భం లో ప్రాథమిక చికిత్స ఎలా చేయాలి అనే అంశాలపై కూడా సవివరంగా తెలియజేయడం జరిగింది.

## కొండమీదరాయున్ని దర్శించుకున్న దత్త విజయానంద తీర్థ స్వామీజీ



స్వామివారిని దర్శించుకున్న దత్తవిజయానందతీర్థస్వామీజీ

**బుక్కరాయసముద్రం జనవరి 28 ప్రభాతవార్త**

శ్రీ కొండమీదరాయుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుదవారం దత్త విజయానంద తీర్థ స్వామీజీ,మైసూర్ బాల స్వామి ఉత్తరాధికారి దత్త పీఠం మైసూరు వారు బ్రహ్మోతవాలలో భాగంగా స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికా రు. అనంతరం ప్రత్యేకపూజలు నిర్వహిం చారు. ఆలయకమిటీ వారు శాలవాలతో మర్యాద పూర్వకంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నారాయణ స్వామి,ఇఒ సాకే రమేష్‌బాబు, రోడ్డు నిర్మాణదాత ఈశ్వర్‌రెడ్డి,ఎస్.నారాయణస్వామి, అర్చకులు చాగంటి లక్ష్మణాచార్యులు ,చాగంటి సురేష్ కుమార్,మండ్లి నగేష్, తదితరులు పాల్గొన్నారు.

## శేష వాహనం పై శ్రీవారు దర్శనం

**బుక్కరాయసముద్రం, జనవరి 28 ప్రభాతవార్త**



కొండమీద వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుదవారం శ్రీవారు సతీసమేతంగా శేష వాహనం పై భక్తులకు దర్శనమిచ్చారు. బుక్కరాయసముద్రంలోని శ్రీ లక్ష్మినారాయణస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి సాయింత్రం భక్తులకు శేష వాహనం పై .గ్రామంలో పురవీదుల గుండా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులుతీర్చు కున్నారు.గురువారం శ్రీవారు హనుమ ద్వాహనం పై ఊరేగనున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యలు గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 8న కేజీఎఫ్ చారిత్రాత్మక సభ

- ఏర్పాట్లల్లో తల మునకలైన యశ్వంత్ హ్యాపీ ఈవెంట్స్

**అనంతపురం కల్చరల్, జనవరి 28 ప్రభాతవార్త**



కేజీఎఫ్ వ్యవస్థాపకులు జెట్టి కుసుమ కుమార్‌తో హ్యాపీ ఈవెంట్స్ నిర్వాహకులు యశ్వంత్

ప్రపంచవ్యాప్తంగా ఉన్న కమ్మ సోదరులను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు 2023వ సంవత్సరంలో కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్)ను జెట్టి కుసుమ కుమార్ వ్యవస్థాపక అధ్యక్షులుగా స్థాపించారు. అప్పుడు హైదరాబాద్ వేదికగా జరిగిన మహాసభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం ఫిబ్రవరి 8వ తేదీన తమిళనాడు తిరువల్లూరు జిల్లా వేమపట్టు గ్రామంలో చారిత్రాత్మకంగా కమ్మ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నహాలు చేస్తున్నట్లు వారు తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలో 65 లక్షల మంది కమ్మవారు ఉండగా వారందరిని ఒక్కతాటిపైకి తీసుకురావడం, అలాగే ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశంలోని కమ్మ ప్రముఖులు అందరిని ఈ కమ్మ మహానాడుకు కేజీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు జెట్టి కుసుమకుమార్ ఆహ్వానిస్తున్నారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ.. ఇంతటి ప్రతిష్టాత్మక కార్యక్రమ నిర్వహణ బాధ్యత తనకు అప్పగించినందుకు జెట్టి కుసుమ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కమ్మ మహానాడు సభ కార్యక్రమ నిర్వహణను హ్యాపీ ఈవెంట్స్ టీం ఒక ఛాలెంజ్‌గా తీసుకుందని, ఇప్పటికే తమిళనాడులో టీవీకే పార్టీ విజయ దళపతి నిర్వహించిన సభను పది లక్షల మందితో విజయవంతం చేశామని, అంతకుమించి ఈ సభను జయప్రదం చేస్తామని యశ్వంత్ తెలిపారు.

## జూనియర్ విద్యార్థులకు అవగాహన సదస్సు



రోడ్ సేఫ్టీ అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

**అనంతపురం కలెక్టరేట్, జనవరి 28 ప్రభాతవార్త**

రోడ్డు సేఫ్టీ మిషన్ లో భాగంగా జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం డీఎస్పీ వి. శ్రీనివాస రావు, త్రీ టౌన్ సీఐ రాజేం ద్రనాథ్ యాదవ్, ట్రాఫిక్ సి.ఐ వెంకటేష్ నాయక్ ల ఆధ్వ ర్యంలో స్థానిక నలంద జూనియర్ కళాశాల లో రోడ్డు భద్రతపై బుధవారం అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లా డుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిం చాలని సూచించారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నియమాలను తప్పని సరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ వినియోగించడం ఎంతో అవసరమని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం, అధిక వేగంతో డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. అలాగే విద్యార్థులు రోడ్డు భద్ర తా నియమాలను తెలుసుకొని తమ కుటుంబ సభ్యులకు, స్నేహి తులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు తమ చదువుతో పాటు ట్రాఫిక్ , రో డ్డు భద్రతా అంశాలపై కూడా అవగా హన కలిగి ఉండాలని, చిన్న వయ సు నుంచే ట్రాఫిక్ నియమాలు పాటించే అలవాటు పెంచుకుంటే భవిష్య త్తులో ప్రమాదాలను నివారించవచ్చని ఈ సందర్భంగా సూచించడం జరిగింది.



రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

06ATP27_06ATP27.qxd 28-01-2026 PM 10:43 Page 1



# గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని ఉద్యమం

- ఫిబ్రవరి 1 నుంచి 9 వరకు గ్రామాల్లో ప్రచార ఆందోళనలు
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కేశవరెడ్డి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

ఉరవకొండ, జనవరి 28 ప్రభాతవార్త

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కేశవరెడ్డి తెలిపారు. ఉద్యమంలో భాగంగా ఫిబ్రవరి 1వ తేదీ నుండి 8 వరకు గ్రామాల్లో ప్రచార ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి 9వ తేదీన ఉపాధి హామీ ఏపీవో కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. బుధవారం ఆయన ఉద్యమానికి సంబంధించిన కరపత్రాలను సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులతో కలిసి పట్టణంలో ఐదుకల్లు సదాశివన్ భవనంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా బి.కేశవ్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో వామపక్ష పార్టీల ఉద్యమాల ఫలితంగా 2005లో కేంద్రంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని రూపకల్పన చేసిందన్నారు. దేశంలో 27 కోట్ల మంది కుటుంబాలకు ఈ చట్టంవల్ల ఉపాధి లభిస్తోందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా ప్రజల్లో పాతుకుపోయిన పేరును బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి జీ రామ్ జీ ఉపాధి చట్టాన్ని తీసుకొచ్చారని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన 2025 కొత్త గ్రామీణ ఉపాధి చట్టం పేదల పని హక్కును హరించి కార్పొరేట్లకు దోహదపడే విధంగా ఉందన్నారు. 2005 ఉపాధి చట్టంవల్ల గ్రామీణ కూలీలకు పని భరోసా, మహిళలకు సమాన వేతనం, వలసల తగ్గింపు సాధ్యమైందన్నారు. కొత్త చట్టంలో కేంద్రం వాటా తగ్గించి రాష్ట్రాలపై భారం మోపడం ద్వారా పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందన్నారు. ఈ కుట్రలను ప్రజలందరూ తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతి ప్రసాద్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.బి.చెన్నరాయుడు, సహాయ కార్యదర్శులు డి.సుల్తాన్, నాగేంద్ర, నాయకులు రమణ, హసేన్‌బాషా, బసవరాజు, కృష్ణ, ప్రసాద్, వెంకటేశులు, గెన్నె మల్లేసి, మోహన్, మహిళా సమాఖ్య నాయకులు వనజాక్షి, నూర్జహాన్ బేగం, అశ్వర్థమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కందుల కొనుగోలులో రైతులకు గిట్టుబాటు ధర ఉండేలా చూడాలి

మంత్రి,ధర్మవరం నియోజకవర్గ ఇంచార్జ్.. హరీష్



కందుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న హరీష్ బాబు

ధర్మవరం రూరల్ జనవరి 28 ప్రభాతవార్త

రైతులు పండించిన కందుల కు మార్కెట్ యార్డులో గిట్టుబాటు ధర ఉండేలా చూడాలని మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ హరీష్ పేర్కొన్నారు. కందుల కొనుగోలు సమస్యలు సాంకేతికంగా వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు హరీష్ బాబు బుధవారం ధర్మవరం మార్కెట్ యార్డ్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మార్కెట్ యార్డ్‌లో ఉన్న రైతులతో నేరుగా మాట్లాడి కందుల కొనుగోలు ప్రక్రియ, మద్దతు ధర అమలు, తూకం విధానం, రవాణా తదితర అంశాలపై సమగ్రంగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కూలంకుశంగా విన్న అనంతరం, ఎలాంటి అవకతవకలు లేకుండా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిగా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ జరగాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు తమ పంటను విక్రయించడంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా, తూకంలో న్యాయం జరిగేలా చూడాలని, అలాగే మద్దతు ధర పూర్తిస్థాయిలో అమలవ్వాలని హరీష్ బాబు అధికారులకు సూచించారు. అవసరమైతే వెంటనే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు.. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ,.... ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతుల కష్టాన్ని అర్థం చేసుకొని, వారి పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోందని స్పష్టం చేశారు. రైతుల శ్రమకు తగిన ఫలితం అందేలా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని తెలిపారు. గతంలో జరిగిన నిర్లక్ష్యానికి ఇకపై తావులేదని, రైతుల పక్షాన ప్రభుత్వం గట్టిగా నిలబడుతుందని పేర్కొన్నారు.

# ఏడిఈ నాగేంద్రను సన్మానించిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు

గుంతకల్లు, జనవరి 28 ప్రభాతవార్త



ఏడిఈ నాగేంద్రను సన్మానిస్తున్న దృశ్యం

ఉత్తమ సేవా అవార్డు అందుకున్న విద్యుత్ శాఖ ఏడిఈ నాగేంద్రను ఆ శాఖ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆలూరు రోడ్డులోని విద్యుత్ భవన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా. పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అధ్యక్షులు సుధాకర్, ట్రెజరర్ కేఎల్.రామాంజనేయులు, నాయకులు రామాంజనేయులు, తిప్పరాజు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-2 ఉద్యోగం సాధించిన గుంతకల్లు యువకుడు

గుంతకల్లు, జనవరి 28 ప్రభాతవార్త



గ్రూప్-2 ఉద్యోగం సాధించిన కురుబ సోమశేఖర్

గుంతకల్లు పట్టణానికి చెందిన యువకుడు గ్రూప్-2 ఉద్యోగం సాధించాడు. పాత గుంతకల్లుకు చెందిన ఎర్రమ్మ, రామాంజనేయులు దంపతుల కుమారుడు కురుబ సోమశేఖర్ గతంలో రైల్వే ట్రాక్‌మెన్‌గా ఉద్యోగం సాధించి, అనంతరం సచివాలయ అడ్మిన్‌గా కూడా ఉద్యోగం సాధించాడు. అయితే ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకున్న అతను సచివాలయ అడ్మిన్‌గా చేరకుండా గ్రూప్-2కు శిక్షణ పొంది ప్రస్తుతం విడుదలైన ఏపీపీఎస్సి గ్రూప్-2లో (ఏఎస్ఒ) జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌కు ఎంపికయ్యాడు. ఇదిలా ఉండగా చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన సోమశేఖర్ తల్లి కష్టంతో పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించడంతో పలువురు అతన్ని అభినందిస్తున్నారు.

# ప్రభుత్వ సేవలు,సంక్షేమ పథకాలు అమలుపై ఆర్డీవో సమీక్ష

బత్తలపల్లి, జనవరి 28 ప్రభాతవార్త



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో మహేష్

మండలంలోని పలు గ్రామాలలో ప్రభుత్వ సేవలు,సంక్షేమ పథకాల అమలును క్షేత్రస్థాయిలో ధర్మవరం ఆర్డీవో మహేష్ పర్యటించి సమీక్షించారు. బుధవారం బత్తలపల్లి తహసీల్దారు కార్యాలయాన్ని ఆర్డీవో మహేష్ తనిఖీ చేసి, కార్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ రెవెన్యూ కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పిజిఆర్ఎస్ గ్రీవెన్స్‌లు, రెవెన్యూ క్లినిక్ గ్రీవెన్స్‌లు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, మ్యూటేషన్ రిజిస్టర్, పిజిఆర్ఎస్ రిజిస్టర్, రెవెన్యూ క్లినిక్, రిజిస్టర్‌లను పరిశీలించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను నిర్ణీత గడువులోపు పరిష్కరించేలా నిర్లక్ష్యం లేకుండా చర్యలు చేపట్టాలని, రిజిస్టర్లను క్రమబద్ధంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయంలో సిబ్బంది హాజరు, అందుబాటుపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు ఎప్పటికప్పుడు సేవలు అందేలా చూడాలని సూచించారు. అదేవిధంగా 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటింటికీ బియ్యం పంపిణీ చేస్తున్న బియ్యం కార్యక్రమాన్ని ఆర్డీవో మహేష్ పరిశీలించారు. వృద్ధులు, రేషన్ దుకాణాలకు వెళ్లకుండా వారి ఇంటి వద్దకే సరుకులు అందడంవల్ల వారికి కలిగే సౌకర్యాన్ని ప్రశంసించారు. ఈ పథకం ద్వారా వృద్ధులకు భద్రత, గౌరవం కలుగుతుందని ఆర్డిఓ పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని ఆంగన్‌వాడీ కేంద్రాన్ని ఆర్డీవో మహేష్ తనిఖీ చేసి అంగన్వాడి కార్యకర్త సువర్ణతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న పోషకాహారం నాణ్యత, పరిశుభ్రత, హాజరు నమోదు, విద్య, ఆటల కార్యక్రమాలను సమీక్షించారు. పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంగన్వాడి కార్యకర్తకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు లబ్ధిదారులకు పూర్తిగా చేరేలా ఆంగన్‌వాడీ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో తహసిల్దార్ స్వర్ణలత, సర్వేయర్ జోసెఫ్, సర్వే డిటి షణ్ము కుమార్, విఆర్ఓ రాణా ప్రతాప్, తదితరులున్నారు.



అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో

# మహిళలు సాంకేతికంగా బలోపేతం కావాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం

ఆర్పిలకు ట్యాబ్ లు అందజేసిన మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు



మెప్మా ఆర్పిలకు ట్యాబ్ లు అందజేస్తున్న మంత్రి సవిత భర్త

పెనుకొండ జనవరి 28 ప్రభాతవార్త

మహిళలు సాంకేతికంగా బలోపేతం కావాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం పట్టణంలోని అన్న క్యాంటీన్ కార్యాలయంలో మెప్మా ఆర్పిలు, టిడిపి మహిళా లీడర్లతో సమావేశం నిర్వహించి, మెప్మా ఆర్పిలకు ట్యాబ్ లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత దిశగా మహిళా ఆర్పీలు పనిచేయాలని మంత్రి సవిత సూచనల మేరకు సమావేశం నిర్వహించడం జరిగిందని, మంత్రి మహిళా అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, మహిళల సాధికారత కోసం మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఎంతో కృషి చేయడం జరుగుతుందని, సంక్షేమంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం జరుగుతోందని, అందుకోసం స్వయం ఉపాధి కల్పించడం జరుగుతుందని, మహిళలను పారిశ్రామిక వేత్తలను చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం మంత్రి సవిత ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు అనంతరం మెప్మా ఆర్పీలకు ట్యాబ్ లు అందజేశారు. పెనుకొండ అర్బన్ టీడీపీ కన్వీనర్ శ్రీరాములు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడాలనే లక్ష్యంతో ఇలాంటి సమావేశాలు నిర్వహించడం ఎంతో ఉపయోగకరమని, జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు సూపర్ సిక్స్ పథకాల అమలు ద్వారా వార్డు స్థాయి నుంచి సర్పంచ్, ఎంపిపి, ఎమ్మెల్యే, ఎంపీ ల వరకు అనేక రాజకీయ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కేవలం పదవులకే పరిమితం కాకుండా, సామాజిక మార్పులో చురుకైన భాగస్వాములుగా నిలవాలని మహిళలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి అర్బన్ కన్వీనర్ శ్రీరాములు, పట్ట ణటీడీపీ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, మాజీ సర్పంచ్ చంద్రకాంతమ్మ, డ్వాక్రా రామాంజనేయులు, సాయి ప్రసాద్, లక్ష్మీదేవమ్మ, పట్టణ మహిళా కార్యకర్తలు, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

# గుత్తి కోట పాఠశాలలో మాక్ అసెంబ్లీ

గుత్తి, జనవరి 28 ప్రభాతవార్త



మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి కోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఎన్నికల పట్ల అవగాహన కోసం ఉపాధ్యాయురాలు రేణుక ఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుభహాన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్నికల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ఈ సందర్భంగా విద్యార్థులకు ఎన్నికల నిర్వహణ పట్ల అవగాహన కల్పిస్తూ ప్రజా ప్రతినిధుల సభ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేత

గుత్తి, జనవరి 28 ప్రభాతవార్త



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

మండలంలోని వ్రాలకుంట గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి న చిన్నారులు వనిషా, యశోదలకు బుధవారం విజయభరత్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. వారి దుస్థితి గురించి పత్రికల్లో కథనాలు రావడంతో స్పందించిన ఆయన 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా తురకపల్లి గ్రామ స్టోర్ డీలర్లు జైపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణలు 50 కిలోల బియ్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రాజశేఖర్, నాగిరెడ్డి, హనుమంతరెడ్డి, శంకర్, మహేష్‌కుమార్, జయరాముడు, తదితరులు పాల్గొన్నారు.

# ఊటకూరు పశు వైద్య శిబిరాన్ని సందర్శించిన స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి. భూపాల్ రెడ్డి



పశు వైద్యదికారులతో టీడీపీ మండల నాయకులు

పరిగి జనవరి 28(ప్రభాత వార్త):

రాష్ట్ర ప్రభుత్వం పశువుల అభివృద్ధి కొరకు ఈ నెల 190126 నుంచి 310126 వరకు రాష్ట్రవ్యాప్తంగా పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించింది. అందులో భాగంగా పరిగి మండలం ఊటకూరు గ్రామంలోని పశు వైద్య కేంద్రాన్ని బుధవారం స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి భూపాల్ రెడ్డి సందర్శించారు. స్థానిక పశు వైద్య కేంద్రంలో రైతులతో కలిసి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ పశు రైతుల సమక్షంలో పశువులకు నేరుగా గోరాముల మందు ఎలా పిచికారి చేయాలో చూపిస్తూ గొర్రెలకు, మేకలకు, పశు దూడలకు నటల్ (నూలిపురుగుల) మందును నేరుగా పశువులకు వేయించారు. సెక్స్ సార్టెడ్, సెమిన్, జంతుసంక్షేమ పక్షోత్సవాల గురించి అవగాహన కల్పించారు. రైతులకు మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది ప్రత్యేక ఆహ్వానం మేరకు మండల కన్వీనర్ యస్.ఎన్. గోవిందరెడ్డి పాల్గొని పశువులకు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి భూపాల్ రెడ్డి, డి.ఏ.హెచ్.ఓ. డాక్టర్ శుభదాసు, డీడీఎహెచ్ డాక్టర్ పెంచలయ్య, పశు వైద్యాధికారి డాక్టర్ బి గీతావాణి, పారా స్టాఫ్, ఏ హెచ్ ఏ లు స్థానిక నాయకులు రైతులు పాల్గొన్నారు.

# నేడు వాల్మీకి మహర్షి నూతన శిలావిగ్రహ స్థిరప్రతిష్ట మహోత్సవం

రొళ్ల జనవరి28 ప్రభాతవార్త

మండలంలోని రత్నగిరి మహా సంస్థానం గ్రామస్థుల వాల్మీకి కుల బాంధవుల ఆధ్వర్యంలో నేడువాల్మీకి మహర్షి నూతన శిలావిగ్రహ స్థిరప్రతిష్ట మహోత్సవ నిర్వహిస్తున్నట్లు వాల్మీకి కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం, విగ్రహస్థిరీకరణ, యాగేశ్వరారాధన, ప్రతిష్టాంగ హోమం జరిపి మధ్యాహ్నం, ప్రాణప్రతిష్ఠ, నేత్రోన్మీలనం, బలిహరణం, పూర్ణాహుతి, కలశోధకమార్జనం 108 కలశాల అభిషేకం, పూజా, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం, అనంతరం అన్నసంతర్పణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాలతో పాటు వాల్మీకి కులస్తులు భగవంతుని కృపకు పాత్రులు కావాలని, రత్నగిరి మహా సంస్థానం గ్రామస్థులు, వాల్మీకి కులబాంధవులు, కోరారు.

# చింత చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

అమరాపురం జనవరి 28 ప్రభాతవార్త



మృతుడు లింగప్ప ఫైల్ ఫోటో

మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 11 గంటలకు చింత చెట్టు లోని చింత పండ్లు మరియు ఎండిన చింత కట్టెలను విరుస్తానని వెళ్లిన కురుబ లి2గప్ప(78)చింత చెట్టు పై నుండి క్రిందకుపడి కుడి చెయ్యి, కాలు పెరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే స్పందించి బందు మిత్రులు అమరాపురం మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండడంతో తక్షణం వైద్య సిబ్బంది మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయడంతో అక్కడ పరీక్షించిన వైద్యులు హిందూపురం జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ కు మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక వాహనం ద్వారా తరలించారు. అయితే బుధవారం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ లింగప్ప మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న అమరాపురం ఎస్ఐ ఎస్ కే వలీబాషా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఎస్ఐ రామాంజనేయులు పరి సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్తమ అవార్డు గ్రహీతలను సన్మానించిన ఎంపీడీవో వెంకట రంగారావు

తాడిమర్రి జనవరి 28 (ప్రభాతవార్త)



అవార్డు అందుకున్న వారిని సన్మానిస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ అవార్డులు అందుకున్న ఏపీవో అనిల్ కుమార్ రెడ్డి, దాడితోట, చిల్లవారి పల్లి, టెక్నికల్ అసి స్టెంట్ సుధీర్ కుమార్ లను బుధ వారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట రంగారావుతోపాటు ఉపాధి హామీసిబ్బంది పాల్గొని అవార్డు గ్రహీతలకు పూలమాలలు, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీడీవో వెంకట రంగారావు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ జవాబుదారీగా పనిచేసినందుకు జిల్లా ఉన్నతాధికారులు గుర్తించి ఏపీవో అనిల్ కుమార్ రెడ్డికి టెక్నికల్ అసిస్టెంట్ సుధీర్ కుమార్‌లకు ఉత్తమ అవార్డులు ప్రకటించడం శుభ పరిణామం అని అన్నారు. వారు ఇంకా ప్రజల ఆకాంక్షల మేరకు మెరుగైన సేవలు అందించి మరెన్నో అవార్డులను సొంతం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవో మెషియా, పరిపాలన అధికారి సురేష్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సుదర్శన్ రెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సీతారామలక్ష్మి, ఈసీ సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శులు రిజ్వాన, వెంకటరెడ్డి, వెంకటరమణ, హరీష్, ధనలక్ష్మి, నారాయణస్వామి, పరమేష్, చంద్రకళ, టెక్నికల్ అసిస్టెంట్లు పుణ్యవతి, వెంకటకృష్ణ, అనురాధ, అరుణమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ వక్కిరిగాళ్ళగణేష్, రాజశేఖర్, ఈశ్వర్ తేజ, నాగార్జున, నరేష్, హేమంత్, శ్రీనివాసులు, వెంకటరామిరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు శంకర్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# నేడు భీష్మఏకాదశి పర్వదిన వేడుకలు

బుక్కపట్నం, జనవరి 28, ప్రభాతవార్త

మండల కేంద్రమైన బుక్కపట్నంలోని చౌడేశ్వరీ దేవాలయం నందు గురువారం రోజున భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు చౌడేశ్వరీ మాత భక్త మండలి సభ్యులు తెలిపారు. విజయనగర మహాసామ్రాజ్య స్థాపకులైన హరిహర రాయలు, బుక్కరాయలు ఆస్థాన మంత్రి చిక్కన్న వడియార్ ఆధ్వర్యంలో క్రీ.శ.14వ శతాబ్దంలో బుక్కపట్నం చెరువును నిర్మించడం జరిగిందని, ఆ సమయంలో ఆయన తమ కులదైవమైన చౌడేశ్వరీ దేవి అమ్మవారి దేవాలయం నిర్మించారన్నారు. గత 67 సంవత్సరాలుగా ఈ దేవాలయంలో భీష్మఏకాదశి వేడుకలను నిర్వహిస్తున్నామని, ఈ క్రమంలో 29వ తేదీన ఉదయం గోపూజ, గణపతిపూజ, తులసి పూజ, అమ్మవారి పూజ, శ్రీమద్భగవద్గీత పారాయణ, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, భక్తుల చే చౌడేశ్వరీ అమ్మవారికి ఒడిబియ్యం సమర్పణ ఇత్యాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే రోజు రాత్రి 8 గంటల నుండి అఖండ భజన నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. భక్తుల సౌకర్యార్థం గురువారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు నిరంతర అన్నదాన ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు. కావున భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.

# వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించిన రూరల్ సిఐ జనార్దన్

లేపాక్షి, జనవరి 28 ప్రభాతవార్త



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిఐ జనార్ధన్, ఎస్ఐ నరేంద్రలు

లేపాక్షి మండల పరిధిలోని చోళసముద్రం టోల్ ప్లాజాజాతీయ రహదారిపై హిందూపురం రూరల్ సిఐ జనార్ధన్, లేపాక్షి ఎస్ఐ నరేంద్రలు బుధవారం వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు సలహాలను అందజేశారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్లు నడిపేవారు విధిగా సీట్ బెల్ట్‌ను ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అతి వేగంగా వాహనాలు నడపరాదన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి వాహనదారులు తప్పనిసరిగా నియమాలు పాటించాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీ మోర్చా నాయకుడు మృతి

హిందూపురం టౌన్ జనవరి 28 ప్రభాతవార్త



శ్రీనివాసులు భౌతికాయానికి నివాళులర్పిస్తున్న రమేష్ రెడ్డి.

హిందూపురం పట్టణంలోని వీవర్స్ కాలనీలో నివాసముంటున్న ఓబీసీ మోర్చా మాజీ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు మృతి చెందాడు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ సెంట్రల్ సీడ్స్ డైరెక్టర్ రమేష్ రెడ్డి తదితరులు బుధవారం శ్రీనివాసులు నివాసానికి వెళ్లి భౌతికాయానికి భారతీయ జనతా పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాసులు పార్టీలో చురుకైన నాయకుడని వీవర్స్ కాలనీలో ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కారంలో ముందు ఉంటాడని ఆయన సేవలను కొనియాడారు. శ్రీనివాసుల కుటుంబానికి బీజేపీ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోండి

నగదు రహిత చికిత్స అందించాలి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి, జనవరి 28, ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పి సతీష్ కుమార్ లు



హాజరైన సంబంధిత శాఖల అధికారులు

రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తో కలిసి కలెక్టర్ జిల్లా రహదారి భద్రత కమిటీ నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా ఎన్ హెచ్ 44 రహదారిపై తరచుగా ప్రమాదాలు జరిగే ఆరు ప్రదేశాలలో తగు చర్యలు తీసుకొనుటకు రూ. 1.4 కోట్లు నేషనల్ హైవే అథారిటీ మంజూరు చేసిందన్నారు. అలాగే ఎన్ హెచ్ 42 రహదారిపై తరచుగా ప్రమాదాలు జరుగు ప్రాంతాలలో త గిన చర్యల కోసం 9.2 కోట్ల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. అలాగే కియా పరిశ్రమ తమ సి ఎస్ ఆర్ నిధుల నుంచి సుమారు 30 లక్షల రూపాయలు ఇస్తున్నటులు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించని వాహనదారులకు ఫిబ్రవరి మాసం ఒకటవ తేదీ నుండి నుండి పెట్రోల్ బంకు వద్ద పెట్రోలు ఇవ్వరని, అపరాధ రుసుములు విధించడం జరుగుతుందన్నారు. జిల్లా ఎఫ్ పి ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాలలో పోలీసు వారి ఆధ్వర్యంలో రాత్రిపూట జరుగుతున్న స్టాప్ వాష్ అండ్ మూవ్ ను కొనసాగించాలని తెలిపారు. కొన్ని ప్రైవేటు వైద్యశాలలో ఇంతవరకు ఐరాడ్ తో అనుసంధానం అవ్వలేదు. అలా అవ్వని వారిని అందరిని కూడా త్వరితగతిన అనుసంధానం చేసుకోవాల్సిందిగా తెలిపారు. అలాగే ప్రమాదాల బారిన పడిన వ్యక్తులకు నగదు రహిత చికిత్స అందించాల్సిందిగా డిఎం అండ్ హెచ్ ఓ ను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జిల్లా రవాణాధికారి మధుసూదన్, హిందూపురం ఆర్టీవో, జిల్లాలోని డి.ఎస్.పి లు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్ అండ్ బి, డి ఎం హెచ్ ఓ తదితర అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన జిల్లా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు

పుట్టపర్తి (కలెక్టరేట్), జనవరి 28, ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి జిల్లా నూతన అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌ను ఆయన ఛాంబర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు మొక్కలు, పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తొలుత సత్యసాయి జిల్లాకు కొత్తగా నియామకమైన అక్రిడేషన్ కమిటీని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కమిటీ సభ్యులు జిల్లా పాత్రికేయుల అభ్యున్నతికి పారదర్శకంగా పనిచేయాలని, జనవరి 31 నాటికి అక్రెడిటేషన్ గడువు పూర్తవుతుందని ఈ మూడు రోజుల్లో అందుకు సంబంధించిన అధికారులు, అక్రిడీటేషన్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి అతి త్వరలో అర్హులైన పాత్రికేయులందరికీ కొత్త అక్రెడిటేషన్ మంజూరుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నూతన అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు ఎద్దుల సంతోష్ రెడ్డి, శివరామకృష్ణ, సి.పుల్లయ్య, శంకరప్ప, సాయికుమార్, గోవర్ధన్ రెడ్డి, గోగుల చక్రపాణి, శ్రీనివాసులు, కె.వి.సుబ్బయ్య, శివ కుమార్, వి.శివకుమార్, శివప్పలతోపాటు పాత్రికేయులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలుసుకున్న నూతన అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు దృశ్యం

## తక్కువ పెట్టుబడి పెట్టి లాభాలు పొందేందుకు అలుసంద సాగు మేలు

- జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేష్
- ఉరవకొండ రైతు సురేష్‌రెడ్డి సాగు చేసి అలుసంద పంట సందర్శన



అలసంద పంటను పరిశీలిస్తున్న జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేష్

ఉరవకొండ, జనవరి 28 ప్రభాతవార్త

తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ లాభాలు పొందేందుకు అలుసంద పంట సాగు రైతులకు ఎంతో మేలని జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్ అన్నారు. ఉరవకొండ పట్టణానికి చెందిన సురేష్‌రెడ్డి అనే రైతు సాగు చేస్తున్న అలుసంద పంట పొలాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నాగమల్లి ఓబులేష్ మాట్లాడుతూ రైతు సురేష్‌రెడ్డి రెండు ఎకరాల్లో ఎకరానికి 4 కేజీల చొప్పున డిసెంబర్ 1న విత్తనం వేశారని ప్రస్తుతం 58 రోజులకే పంట ఎంతో ఆశాజనకంగా ఉందన్నారు. కేవలం రెండు సార్లు మాత్రమే అంతర సేద్యం, ఒకసారి కలుపు తొలగించారన్నారు. చుట్టుప్రక్కల రైతులు మినుములు, పెసర పంట వేయగా సురేష్‌రెడ్డి అలసందను సాగుచేసి మంచి దిగుబడిని సాధిస్తున్నారన్నారు. పంట మార్పిడి పద్ధతిని అనుసరించడంవల్ల భూసారం పెరుగుతుందని అలుసంద పంట తర్వాత సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. పెట్టుబడులు తగ్గించుకొని మంచి దిగుబడులు సాధించి లాభపడటానికి స్వల్పకాలిక పంటల వైపు రైతులు మొగ్గు చేపాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా వాతావరణానికి అనువైన పంటలను ఎంచుకొని సాగుచేసి లాభపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు బందయ్యగౌడ్, జై కిసాన్ ఫౌండేషన్ ప్రతినిధి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ సందేశ యాత్రలో బ్యాళ్ళ శివప్రసాద్

- మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డితో కలిసి అడుగులో అడుగు



మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డితో డీసీసీ ఉపాధ్యక్షుడు బ్యాళ్ళ శివప్రసాద్

ఉరవకొండ, జనవరి 28 ప్రభాతవార్త

మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి బుధవారం నుండి చేపట్టిన మహాత్మా గాంధీ సందేశ్ యాత్రలో ఉరవకొండ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బ్యాళ్ళ శివప్రసాద్ పాల్గొన్నారు. నేటి యువతకు, విద్యార్థులకు గాంధీ సిద్ధాంతాలను తెలియజేయాలని, శాంతి, సామరస్యం, సోదరభావంతో అందరం ఒక్కటిగా ఉండాలని, భారతీయులందరూ ఒక్కటే అని మహాత్మా గాంధీ వేసిన మార్గాన్ని సజీవంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని తెలియజేయడానికి నీలకంఠాపురం నుండి హిందూపురం వరకు 3 రోజులు ఆయన పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎన్.రఘువీరారెడ్డిను కలిసిన బ్యాళ్ళ శివప్రసాద్ శుభాకాంక్షలు తెలియజేసి ఆయన అడుగులో అడుగులు వేస్తూ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాళ్ళ శివప్రసాద్ మాట్లాడుతూ సీనియర్ నేత ఎన్.రఘువీరారెడ్డి ఎంతో గొప్ప సంకల్పంతో పాదయాత్రను నిర్వహిస్తున్నారని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా మూడు రోజులపాటు జరుగుతున్న పాదయాత్రలో అందరూ భాగస్వాములై జాతికి మంచి సందేశాన్ని ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

## శ్రద్ధగా చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలి

- జిల్లా వృత్తి విద్యాధికారి (డీవీఈవో) గురవయ్యశెట్టి
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రీ ఫైనల్ పరీక్షల తనిఖీ



ప్రీ ఫైనల్-2 పరీక్షలను తనిఖీ చేస్తున్న డీవీఈవో గురవయ్యశెట్టి

ఉరవకొండ, జనవరి 28 ప్రభాతవార్త

విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని త్వరలో జరగబోయే పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల వృత్తి



కళాశాల అధ్యాపక బృందంతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీవీఈవో గురవయ్యశెట్టి

విద్యాధికారి (డీవీఈవో) గురవయ్యశెట్టి సూచించారు. బుధవారం ఆయన ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి ప్రతి తరగతి గదిని, ప్రీ ఫైనల్-2 పరీక్షలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు ముచ్చటించి వారికి బంగారు భవిష్యత్తుకు దోహదపడే అనేక విషయాల గూర్చి మార్గనిర్దేశం చేశారు. ఇదివరకు జరిగిన పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషకాలను అందజేశారు. అనంతరం అధ్యాపక బృందంతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు సిబ్బంది డీవీఈవో గురవయ్యశెట్టిను శాలువాకప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, సీనియర్ అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి, ప్రసాద్, లక్ష్మినారాయణరెడ్డి, శివప్రసాద్, సాయి, ప్రవీణ్, జెపి, హమీదా బేగం, అనీత, అనీతాకుమారి, శ్రీదేవి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడపడం ప్రమాదకరం

- అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ పి.జనార్ధననాయుడు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ పి.జనార్ధననాయుడు

ఉరవకొండ, జనవరి 28 ప్రభాతవార్త

హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడపడం ఎంతో ప్రమాదకరమని అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.జనార్ధననాయుడు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఆయన సిబ్బందితో కలిసి రోడ్డు నిబంధనలు పాటించకుండా వాహనాలు నడుపుతున్న వారికి అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారి పక్కన కెకె ఫిల్లింగ్ స్టేషన్‌వద్ద రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.జనార్ధననాయుడు మాట్లాడుతూ కార్లు, ఇతరత్రా వాహనాలు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. వేగం కన్నా ప్రాణం మిన్న అని సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారుల్లో వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. లేకుంటే ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవడమో లేక అంగవైకల్యం పొందడమో జరిగి మిమ్మల్ని నమ్ముకున్న కుటుంబాన్ని కష్టనష్టాలపాలు చేయడం జరుగుతుందని ఈ విషయాన్ని వాహన చోదకులందరూ గుర్తుంచుకోవాలని సూచించారు.

## కొమ్మ రాజశేఖర్ రెడ్డికి నివాళి అర్పించిన ఎమ్మెల్యే అమిలినేని



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం జనవరి 28 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన కొమ్మ రాజశేఖర్ రెడ్డి అనారోగ్యంతో స్వర్గస్థులైన విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వ్యక్తిగతంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, రాజశేఖర్ రెడ్డి మరణం కుటుంబానికి మాత్రమే కాకుండా స్నేహితులు, శ్రేయోభిలాషులకు తీరని లోటని అన్నారు. బెంగళూరు ఆసుపత్రిలో కొమ్మ రాజశేఖర్ రెడ్డి భౌతికకాయానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పుష్పాంజలి ఘటించి ఘన నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలుసుకుని వారిని పరామర్శిస్తూ ధైర్యం చెప్పారు. ఈ విషాద సమయంలో తెలుగుదేశం పార్టీ తరఫున తాము ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాజశేఖర్ రెడ్డి సేవలు, ఆయనతో గల అనుబంధాన్ని స్మరించుకుంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తిని కుటుంబ సభ్యులకు దేవుడు ప్రసాదించాలని ఎమ్మెల్యే అమిలినేని ఆకాంక్షించారు.

## నూతన గృహప్రవేశ వేడుకల్లో కాపు



గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కాపు

డి.హిరెహాళ్ జనవరి 28 ప్రభాతవార్త

రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి మండల బిజెపి నాయకులతో కలిసి నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని పూజలు చేయించారు. బుధవారం డి.హిరెహాళ్ మండలం ఓబులాపురం గ్రామంలో సర్పంచ్ బోయ మల్లికార్జున దంపతుల ఆహ్వానం మేరకు వారి నూతన గృహప్రవేశ కార్యక్రమంకు ఎంపీపీ పవిత్ర, మండల బిజెపి నాయకులు వన్నూరుస్వామి, రాళ్ల తిమ్మారెడ్డి తదితరులతో కలిసి హాజరయ్యారు. గృహప్రవేశ వేడుకల్లో నిర్వహించిన ప్రత్యేక పూజలు అనంతరం కాపు మల్లికార్జున దంపతులను ఆశీర్వదించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు శ్రీనివాసులురెడ్డి, పరమేశ్వరప్ప, ఎంపీటీసీ తిప్పేస్వామి, బిజెపి నాయకులు మల్లికార్జున, పెద్ద ఆంజనేయ, కళ్యం సురేష్, మల్లికార్జున, కల్యం నాగరాజు, ఖాసింపీర, చంద్రశేఖర్ రెడ్డి, బోర్వేల్ నాగిరెడ్డి, గొల్ల సురేష్, బసవరాజు, హనుమయ్యా, వెంకటేష్ రెడ్డి, నిషర్ అహమ్మద్, హనుమంతరెడ్డి, వడియర్ తిప్పేస్వామి, పంపాపతి గౌడ, గౌసిద్ధ, హనుమంత రాయుడు, రుద్రప్ప, తిప్పేస్వామి, వన్నురస్వామి, బోయ గోవింద, వసగుడ్డంమంజు, గిరీష్,లోకేష్, ఏర్రిస్వామీ, పాల్గొన్నారు.

## పూరిలో ఆపదలో చిక్కుకున్న ధర్మవరం కుటుంబానికి మంత్రి అండ



పూరి రైల్వేస్టేషన్లో ఉన్న బాదిత కుటుంబసభ్యులు

ధర్మవరంటౌన్, జనవరి 28 ప్రభాతవార్త

ప్రజలపట్ల తనకున్న బాధ్యత, మానవీయ దృక్పథాన్ని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్యాదవ్ అండగా నిలిచినట్టు బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీశ్ బాబు తెలిపారు. రాష్ట్ర కేబినేట్ సమావేశంలో పాల్గొంటున్న సమయంలో తన నియోజక వర్గానికి చెందిన ప్రజలు ఆపదలో ఉన్నారన్న విషయం తెలిసిన వెంటనే కేవలం ఐదు నిమిషాల్లోనే స్పందించి మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణగా నిలిచారన్నారు. ధర్మవరంపట్టణంలోని శారదనగర్ వాసులు లక్ష్మీదేవి కుటుంబం సభ్యులు ఆరు మంది పూరిజగన్నాథ టెంపుల్ దర్శనానికి వెళ్లిన సందర్భంగా అక్కడ అనుకోని ప్రమాదంలో వారితో తీసుకెళ్లిన లగేజ్ మొత్తాన్ని కోల్పోయారన్నారు. ఆర్థికంగా, బౌతికంగా ఎలాంటి సహాయంలేని పరిస్థితిలో ఆ కుటుంబం రెండు రోజుల పాటు రైల్వేస్టేషన్లోనే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం మంత్రి సత్యకుమార్ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో స్పందించిన మంత్రి బాదిత కుటుంబానికి అవసరమైన రైలు టికెట్లు, ప్రయాణపు ఖర్చులు, తాత్కాలిక వసతివంటి అన్ని ఏర్పాట్లు చేయించారన్నారు. అంతేకాకుండా మధ్యాహ్నం 12గంటలకు ఉన్న రైలులో ఆ కుటుంబం సురక్షితంగా ఎక్కేవరకు పూర్తిబాధ్యత తీసుకుని వారికి ఎలాంటి ఇబ్బందులు కల్గకున్డా చేశారన్నారు.

## సంధారాఘక్రికెట్ లో రాణించి ధర్మవరంకు పేరుప్రతిష్టలు తీసుకురావాలి

ధర్మవరంటౌన్, జనవరి 28 ప్రభాతవార్త



అండర్12 క్రికెట్ మండల జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో టీడీపీనాయకులు

క్రికెట్‌లో రాణించి ధర్మవరంకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని చేనేతప్రముఖులు, టీడీపీనాయకులు సంధారాఘవ సూచించారు. గత వారంలో ఆర్డీటీ క్రీడామైదానంలో అండర్12 క్రికెట్ మండల జట్టుకు 12 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరు బుధవారం టీడీపీనాయకులు సంధారాఘవను కలిశారు. క్రీడాకారులకు తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయన్నారు. అదేవిధంగా క్రీడాకారులకు కలర్ జెర్సీలు, క్రికెట్లు కిట్లను అందిస్తానని హామీ ఇచ్చారు. క్రికెట్ క్రీడలో రాణించి జాతీయస్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## పేరుకే కంది కొనుగోలు కేంద్రం ఏర్పాటు..

- కంది రైతుల కంట కన్నీరే - పరేషాన్‌లో కంది రైతులు
- ఇలా కొన్నారు అలా వెనక్కి పంపారు

శెట్టూరు, జనవరి 28 ప్రభాతవార్త



కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు వెనక్కి పంపుతున్న కందులు

మండల పరిధిలోని కంది పంటను పండించిన రైతులు ప్రభుత్వం మద్దతు ధరతో కందులు కొనుగోలు చేస్తామని కంది పండిందించిన రైతులను ప్రభుత్వం ఊరించింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని నమ్మి కొంతమంది రైతులు తాము పండించిన కంది పంటను కొనుగోలు కేంద్రానికి (రైతు సేవ కేంద్రం)కు ములకలేడు, ఖైరేవు, రంగయ్యపాళ్యం, బలపంపల్లి, పెరుగుపాళ్యం గ్రామాల,రైతులు తరలించారు.వాటిని "ఏపి.మార్క్ ఫెడ్"ఏజెన్సీ కొనుగోలు అనంతరం రైతులు పండించిన కందులను ప్రొద్దుటూరుకు తీసుకెళ్లి చివరకు నాసిరకంగా ఉన్నాయన్న నెపంతో కందులు తిరిగి ఇక్కడికే తీసుకురావ్వట ఎంతవరకు సమంజసం అని రైతులు వాపోయారు. ప్రభ్నుత్వ కందిరైతులకు ఒక క్వింటాలుకు 8000/రూపాయలు చెల్లిస్తుందంటే సంతోషించమని చివరికి ఆ రైతులకు కన్నీళ్లే మిగిలిందని రైతులు దోనతిమ్మప్ప,వేణుగోపాల్, సంపత్ కుమార్ లు ఆవేదన వ్యక్తంచేశారు. "మార్క్ ఫెడ్"ఏజెన్సీ సీసీడీ యోగనంద్ ను వివరణ కోరగా....నాసిరకం కందులు ఇందులో ఇలాంటి సరుకును మేము కొనలేమని తిరిగి వెనక్కి పంపమన్నారు.ఈ నిర్ణయంతో రైతులు కొనుగోలు కేంద్రానికి తెచ్చిన కందులను ఆ రైతులకు ఇస్తున్నామన్నారు.

## ఉత్తమ పోలీసుగా అవార్డు అందుకున్న సూర్యనారాయ



కలెక్టర్ తో అవార్డు అందుకుంటున్న సూర్యనారాయణ

కనేకల్లు జనవరి 28 ప్రభాతవార్త

77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కణేకల్ మండల పోలీస్ శాఖలో పనిచేస్తున్న తీ. సూర్యనారాయణ పనిచేసిన సేవలను గుర్తించి విజేత అవార్డుకు సెలెక్ట్ అయ్యారు. ఈ అవార్డు ను అనంతపురం జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ పోలీస్ విజేత అవార్డును అందుకున్నారు అవార్డు అందుకున్న పోలీస్ సూర్యనారాయణని పలువురు అభినందించారు.

## చింత తోపు వేలంపాటలో 80 వేలు ఆదాయం

అమరాపురం జనవరి 28 ప్రభాతవార్త



చింత తోపు వేలంపాట దృశ్యం

మండల పరిధిలోని వలస గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో స్థానిక సర్పంచ్ జితేంద్ర అధ్యక్షతన స్థానిక గ్రామ కార్యదర్శి వీరకరియప్ప సమక్షంలో వలస చింత తోపు వేలంపాటను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వలస గ్రామానికి చెందిన దొడ్డ ఓబులప్ప గారి ఈరన్న 80 వేల రూపాయలకు వేలంపాటను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ టిడిపి కన్వీనర్ శివరుద్రప్ప, అమరాపురం సింగల్ విండో అధ్యక్షుడు గణేష్, మాజీసర్పంచులు చంద్రశేఖర్ గౌడ్, రాధాకృష్ణ, నాగేంద్రప్ప, చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ తిప్పేస్వామి, శివలింగప్ప, దాసే గౌడు, శివకుమార్ బుజ్జి, రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామపంచాయతీకి వలస చింతతోపు వేలంపాట ద్వారా గ్రామ పంచాయతీకి 80వేలు ఆదాయం వచ్చినట్లు స్థానిక సర్పంచ్ జితేంద్ర, గ్రామ కార్యదర్శి వీరకరియప్ప తెలిపారు.

## ఘనంగా జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ

ముఖ్య అతిథులుగా హాజరైన జనసేన జిల్లా అధ్యక్షులు, అహుడ చైర్మన్ టి.సి.వరుణ్ జనసేన జిల్లా ముఖ్య నాయకులు

బ్రహ్మసముద్రం జనవరి 28 ప్రభాతవార్త



జనసేన జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం మండలం, కోనాపురం గ్రామంలో జనసేన పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారుజనసేన పార్టీ ఉమ్మడి అనంతపురము జిల్లా అధ్యక్షులు, అహుడ చైర్మన్ టి.సి. వరుణ్‌కు ఘనంగా సాదర స్వాగతం పలికిన జనసైన్యం. పూల వర్షం కురిపించిన కార్యకర్తలు, అభిమానులు. మంగళ హారతులు పట్టిన మహిళలు, ఆడపడుచులుజనసేన జిల్లా అధ్యక్షులు అహుడ చైర్మన్ టి.సి.వరుణ్ మాట్లాడు తూగ్రామీణ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేస్తాము. జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో అభివృద్ధిని వికేంద్రీకరణ చేస్తూ, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందిస్తున్న కూటమి ప్రభుత్వం. మీకు ఏ కష్టం వచ్చినా కార్యకర్తగా ముందుండి పరిష్కరిస్తాను అని అన్నారు కళ్యాణదుర్గం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బాల్యం రాజేష్ ఆధ్వర్యంలో జై జనసేన అని, పవన్ కళ్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలి, టి.సి.వరుణ్ నాయకత్వం వర్ధిల్లాలి అని నినాదాలతో మార్మోగిన కోనాపురం గ్రామం ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కమిటీ నాయకులు, జనసేన ప్రభుత్వ డైరెక్టర్లు, జనసేన నియోజకవర్గ నాయకులు, జనసేన మండల నాయకులు, జనసేన మండలాల అధ్యక్షులు, మహిళలు, జనసైనికులు, అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇంచార్జ్ ఏపీయంగా బాధ్యతలు చేపట్టిన యస్.లలిత



బ్రహ్మ సముద్రం జనవరి 29 ప్రభాతవార్త

బ్రహ్మ సముద్రం మండల కేంద్రం నందు జననీ సమైక్య కార్యాలయంలో ఇంచార్జ్ ఏపీయం గా యస్ లలిత పదవి బాధ్యతలు చేపట్టారు గతంలో ఉన్న ఎపియం వీరనారప్ప మెడికల్ సెలవుపై వెళ్ళినందున ఎస్.లలితకు ఇంచార్జి ఎపియంగా బాధ్యతలు చేపట్టారు.

బాధ్యతలు చేపడుతున్న దృశ్యం ←

## మున్సిపల్ సమావేశంలో చర్చకు రాని టేబుల్ అజెండా

సమావేశం అనంతరం మాట మార్చిన చైర్మన్, కొందరు కౌన్సిల్ సభ్యులు



మున్సిపల్ సాధారణ సమావేశ దృశ్యం

రాయదుర్గం జనవరి 28 ప్రభాతవార్త

బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పోరాళ్ల శిల్ప అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశంలో అతి ముఖ్యమైన టేబుల్ అజెండా చర్చకు రాకపోవడంతో పలువురు సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు బుధవారం ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమైంది ఈ సందర్భంగా పలువురు కౌన్సిల్ సభ్యులు పట్టణంలో నెలకొన్న సమస్యలను సభా దృష్టికి తీసుకువచ్చారు డ్రైనేజీ వ్యవస్థ సిమెంట్ రోడ్లు పనితీరు తిట్టుకో ఏళ్ళు ఎప్పుడు ప్రారంభం అవుతున్నాయని పలు సమస్యలపై కౌన్సిలర్ గోవిందరాజులు సభ దృష్టికి తీసుకువచ్చారు దీంతో మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి త్వరలోనే ప్రారంభిస్తామని సమాధానం చెప్పారు అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యాలయముకు గ్యాస్ గోడౌన్ వద్ద స్థలం కేటాయించాలని టేబుల్ అజెండాలో పొందుపరిచినట్లు ఈ ఎజెండాను అందరి సభ్యులకు పంపించినట్లు చైర్మన్ తెలిపారు అయితే ఈ విషయంపై అవగాహన లేకపోవడంతోనే అజెండాను పక్కన పెట్టినట్లు ఆమె అనంతరం విలేకరులతో మాట్లాడారు

## బంజారా జాతిలో మెరిసిన ఆణిముత్యం.. గంగాధర్ నాయక్

ఉద్యోగ ప్రయాణంలో మూడవ కొలువు ఎక్సైజ్ ఎస్సైగా ఎంపిక.

రాయదుర్గం జనవరి 28 ప్రభాతవార్త



ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికైన గంగాధర్ నాయక్

తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్2 అభ్యర్థుల నియామకాల్లో రాయదుర్గం అగ్నిమాపక శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్న సుగాలి గంగాధర్ నాయక్‌కు గ్రూప్2 పరీక్షలలో మెరిసినందున ఎక్సైజ్ ఎస్సైగా ప్రకటించింది. ఈ మేరకు సుగాలి గంగాధర్ నాయక్ రాయదుర్గం మండలం మల్లాపురం తండాలో ఓ నిరుపేద కుటుంబంలో జన్మించి 2019 వ సంవత్సరంలో సచివాలయ ఉద్యోగాలలో పంచాయతీ సెక్రటరీ, గ్రామ వార్డు సచివాలయాల శానిటేషన్ సెక్రటరీగా కొలువు సాధించాడు. అక్కడితో ఆగకుండా 2020లో అగ్నిమాపక శాఖ కొలువులలో ఫైర్ కానిస్టేబుల్ గా ఉద్యోగాన్ని అధిరోహించారు. ముచ్చటగా తన ఉద్యోగ పోరాటాన్ని అక్కడితో ఆపకుండా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్2 నియామకాల్లో ఎక్సైజ్ ఎస్సైగా మెరవడం ఆ జాతికి గర్వకారణమైంది. చదువులలో తరగతులను ఎక్కినట్లు ఒక్క ఉద్యోగం సాధించిన తర్వాత కూడా ఉన్నత ఉద్యోగాలకు ప్రయత్నిస్తూ.. ప్రస్తుతం ఎక్సైజ్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించనున్నారు. మూడు ఉద్యోగాలను స్వీకరించిన ఈయన విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ విద్యాలయాల్లోనే విద్యనభ్యసించి ఇంతటి శిఖరాలను అందుకోవడం చాలా గర్వకారణమని తన తల్లిదండ్రులు, బంధుమిత్రులు, సహచర ఉద్యోగులు, కొనియాడారు. ఈ నేపథ్యంలోనే ఆయనకు అందరూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## కంబదూలో ఆటో బోల్తా

కంబదూరు, జనవరి 28 , ప్రభాతవార్త



బెంగళూరు రహదారిపై ఆటో బోల్తా పడిన దృశ్యం

కంబదూరు మండల కేంద్రం పెట్రోల్ బంకు సమీపంలోని బెంగళూరు ప్రధాన రహదారిపై బుధవారం ఆటో బోల్తా పడి పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. కూరగాయలు తీసుకెళ్తుండగా ఆటో బ్రేక్ కట్ కావడంతో అదుపు తప్పి ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.ఆటో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. కూరగాయాలు కింద పడి చెల్లాచెదురై ఆర్థిక నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ఆటలో ప్రయాణిస్తున్న వారికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

## 30న ప్రజా దర్బార్ లో పాల్గొంటున్న ఎమ్మెల్యే కాలవ

కనేకల్లు జనవరి 28 ప్రభాతవార్త

కనేకల్లు మండలంలోని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఈనెల 30వ తేదీ శుక్రవారం రాయదుర్గం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రజా దర్బార్ ఏర్పాటు చేశారని ఈ కార్యక్రమంలో అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో విజయ్ సింహ రెడ్డి తెలిపారు. ప్రజా దర్బార్ కు అన్ని శాఖల అధికారులు మండలము లోని సమస్య లు ఉన్న ప్రజలు అందరూ తప్పకుండా హాజరు కావలసిందిగా తెలిపారు. అధికారులు తప్పకుండా ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయము సమావేశ భవనం నందు హాజరుకావాలని ఎంపీడీవో విజయసింహారెడ్డి తెలిపారు.

## హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి : ఎస్సై నాగ మధు

కనేకల్ జనవరి 28 ప్రభాతవార్త



హెల్మెట్ పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగ మధు

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తలకు పెట్టు కోకపోవడం వలన ఈ యాక్సిడెంట్ లోయి వాళ్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవా లని ఎస్ఐ నాగ మధు ప్రజలకు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా కనేకళ్ మండల కేంద్రం లో ప్రజలకు హెల్మెట్ నాణ్యత పై అవగాహన కల్పించారు. అదేవిధంగా రోడ్ సేఫ్టీ గురించి ఆటో లో టామ్ టామ్ వేయించారు.

## మహాత్మాగాంధీ సందేశ యాత్రను జయప్రదం చేయండి

ఏ ఐ సి సి అధ్యక్షులు కేటీ శ్రీధర్ పిలుపు

పరిగి జనవరి 28(ప్రభాత వార్త ):

మాజీ మంత్రి ఎన్. రఘువీరా రెడ్డి చేపట్టిన మహాత్మాగాంధీ సందేశ యాత్రను జయప్రదం చేయాలని కేటీ శ్రీధర్ పిలుపునిచ్చారు. బుధవారం నీలకంఠపురం గ్రామం నుండి ప్రారంభమయ్యే ఈ పాదయాత్ర 29, 30 తేదీలలో పరిగి మండలంలో కొనసాగుతుందని, ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పాదయాత్రను పాత్రికేయులు కవరేజ్ చేస్తూ ఈ పాదయాత్ర పై ప్రజల్లో విస్తృత చర్చ జరిగేలా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.

